# అద్దె ఇల్లు

"ఏవండీ! ఇల్లు చాలా బాగుంది కదండీ. ఇటు చూడండి ఈ ఇంట్లో, వంటింట్లో ఎన్ని అల్మైరాలో. అబ్బ ఇల్లు బ్రహ్మాండంగా ఉంది కదండీ" అంది కామాక్షి సంబరపడిపోతూ.

"బాగుండదుటే మరి! అద్దె పన్నెండొందలైతేనూ" అన్నాడు కుటుంబరావు తెగ బాధపడిపోతూ.

"ఆఁ..అద్దెలిచ్చినంత మాత్రాన ఇంత మంచి ఇల్లు దొరుకుతుందండీ! ఒక్క చుక్క నీరు తోడనక్కర్లేకుండా ఇలా పంపుతిప్పితే అలా నీళ్ళు వస్తాయి. పోస్టాఫీసు, బజార్, లైబ్రరీ, రైల్వే స్టేషన్. భస్ స్టేషన్ అన్నీ దగ్గరే! వింటున్నారా మిమ్మల్నే!"

"ఊఁ.."

"ఏవండీ! చూడండీ మన ఇంటి నుంచి ఇలా రెండడుగులు వేస్తే లైబ్రరీ. లైబ్రరీలో డబ్బులు కట్టీ..."

"నవల్సా అవీ తెచ్చుకుంటూ ఉంటావ్!"

"అవునండీ! ఎంతో కట్టనవసరంలేదు. నెలకి ముప్పై రూపాయలే" అంది.

"అప్పుడే సమాచారాలు సేకరించేసావన్నమాట. సర్లేగానీ ముందా సామాన్లు సర్దు. మళ్ళీ పిల్లలు స్కూలు నుండి వచ్చేస్తే ఇల్లు పీకి పందిరేస్తారు" అన్నాడు సామాన్లు ఒక్కోటీ తీస్తూ.

"ఎంత! ఇట్టే సర్దేయనూ" అంటూ కామాక్షి సంతోషంగా తనూ సామాన్లు అందుకుంది.

* * *

ఆర్నెళ్ళు గడిచిపోయాయి.

ఓ రోజు...

"ఏమండీ! అబ్బబ్బ...మిమ్మల్నేనండీ" కించిత్ కోపంగా అంది కామాక్షి.

"ఏవిటే?" విసుగ్గా అన్నాడు కుటుంబరావు పేపర్లోంచి తలతిప్పుతూ.

"ఏవిటని మెల్లగా అడుగుతారేవిటండీ.."

కుటుంబరావు మళ్ళీ పేపర్లో తల దూర్చేయడం చూసి కామాక్షికి కోపం వచ్చి "హుఁ! ఎంతసేపూ పేపరూ...పేపరూ...ఏం వుంటుందా పేపర్లో? పేపరు తప్ప ఇంటి గొడవ ఏమైనా పట్టించుకునేది ఉందా?" కోపంగా అంది కామాక్షి.

"అబ్బా! ఏవిటే ఎందుకలా అరుస్తావ్? ఏం జరిగింది?"

"అదికాదండి. నేనివాళ ఇంటద్దె ఇవ్వడానికి వెళ్ళాను?"

"ఊ! వెళ్ళావే! అయితే..." ప్రశ్నార్థకంగా మొహం పెట్టాడు.

"ఇంటద్దె ఇస్తే ఇంటావిడ ఏమందో తెలుసా?"

"ఏమంది?"

"వచ్చే నెలనుండి అద్దె పదమూడొందలు అందండీ" అంది.

"అంటే ఏకంగా వందరూపాయలు పెంచేసిందన్న మాట. ఆ మాట ముందే చెప్పవేం" అన్నాడు కుటుంబరావు గాభరాగా.

"నేను చెప్తుంటే మీరు విన్పించుకుంటున్నారా? అక్కడ అద్దె పెంచేశారని ఇక్కడికొచ్చాం. ఏదో ఇల్లూ అదీ బాగుంది. సౌకర్యంగా ఉంది. అన్నీ దగ్గరే కదా అని అనుకుంటే ఇప్పుడు అద్దె పెంచేసింది. చూడండి" అంది.



"నువ్వేమీ అనలేదుటే" కంగారుగా అన్నాడు.

"అన్నానండి. ఇంట్లో దిగి ఆర్నెల్లేగా అయింది. అప్పుడే వందరూపాయలు పెంచేస్తారా? అని అంటే ఆవిడేమందో తెలుసా? ధరలన్నీ పెరిగిపోయాయి. కరెంట్ ఛార్జీలు కూడా పెరిగిపోయాయి. ఇంటిపన్ను కూడా కట్టాలి అందండీ. మనమీ ఇల్లు మారపోదామండీ. మరీ పదమూడు వందలు మనమెక్కడ్నించి తెచ్చి ఇవ్వగలమండీ" అంది.

"ఇప్పుడంటే ఇప్పుడు ఇల్లెక్కడ దొరుకుతుందే! ఇన్ని సౌకర్యాలు ఉన్న ఇల్లు దొరకడం ఈ మహానగరంలో ఎంత కష్టమో నీకు తెలియంది కాదు. ఊరంతా ఫ్లాట్లే. మనమూ ఫ్లాట్లలో వుండనూలేమూ, అద్దెలు కట్టనూ లేమూ. మనలాంటి మధ్యతరగతివాళ్లకు ఇళ్ళు దొరకడమెంతో కష్టంగా ఉంది. ఏవిటో? ఏం చేయాలో ఏమీ పాలుపోవడంలేదు.

నువ్వా లైబ్రరీలో పుస్తకాలనీ, నవల్సనీ డబ్బు దుబారా చేయక కాస్త ఆదా చేస్తే మనం సరిపెట్టుకోగలమేమో ఆలోచించు!" అంటూ సలహా ఇచ్చాడు.

"ఎంతసేపూ నన్నాడిపోసుకోవడం తోనే మీకు సరిపోతుంది. నేనా లైబ్రరీలో కట్టేది ముష్టి ముప్పై రూపాయలు. మీరు మాత్రం సిగరెట్లకని, పేపర్ కని ఎంత డబ్బు తగలెట్టడం లేదూ! మీరవన్నీ మానేసి పొదుపు చేయవచ్చుగా" ఈసడింపుగా అంది.

"సర్లే! ఆ విషయం వదిలెయ్. అసలిప్పుడేం చేద్దామా అని ఆలోచించు ముందు" అన్నాడు.

"మనం ఎన్నాళ్ళిలా అద్దె ఇళ్ళల్లో వుంటూ కాలక్షేపం చేస్తాం. మనకంటూ ఓ స్వంత ఇల్లుంటే ఎంత బాగుంటుందో కదండీ"

"కానీ అదెలా సాధ్యం?"

"అప్పుడెప్పుడో చవగ్గా కొనేసిన స్థలం మనకంటూ ఒకటుందిగా!

అక్కడ ఎలాగోలా సెటిలైపోదామండి. అదీగాక ఇప్పుడా ఏరియా మునుపటిలా లేదంట. షాప్‌లు, లైబ్రరీలు, కుట్టు సెంటర్లు, బజార్లు, స్కూళ్ళు అన్నీ వున్నాయటండీ! మునిసిపల్ పైప్‌లు, బస్సులు కూడా వేసారంట"

"కానీ ఇప్పటికిప్పుడు ఇల్లెలా తయారువుతుందే!"

"ఇల్లు కట్టాలన్న పట్టుదల ఉంటే ఎంతండీ ఆర్నెళ్ళలో ఇల్లు తయారవ్వదూ!"

"సర్లె! చేతిలో చిల్లిగవ్వ లేదుగానీ ఆర్నెళ్ళలో తయారౌతుందిట ఇల్లు"

"లోనుతీయండి. మనదగ్గర కనీసం లక్షన్నరైనా ఉంటుంది. నా నగలూ అవీ తాకట్టు పెట్టి ఎలాగోలా ఇల్లు కట్టేయాలండీ. పోను పోను ధరలు పెరుగుతున్నాయి కానీ తరగడంలేదు. అయినా మనకంటూ ఒక ఇల్లుంటే ఈ పోరుండదుగా" అంది.

"సర్లె ఆలోచిద్దాం" నీరసంగా అన్నాడు.

"ఆలోచిద్దామంటే కాదు. పనయ్యే మార్గం చూడండి" అంది ఖరాఖండీగా.

కుటుంబరావు మీద భార్య మాటలు బాగా పనిచేశాయి. మరో పదినెలలు గడిచేసరికి రెండువాటాల పెంకుటిల్లు తయారైంది. గృహప్రవేశం చేసారా దంపతులు. ఒక వాటాలో వారుండి పక్కవాటాని అద్దెకిచ్చేశారు.

మూడునెలల తర్వాత కామాక్షి "ఏంటి? దిగి మూడునెలలే అయిందా? అయితే ఏంటిట? మీకు బజార్లు, లైబ్రరీలు, బస్టాండ్, స్కూళ్ళు అన్నీ ఇంటికి దగ్గరగా ఉండాలీ, ఇల్లుకూడా చవగ్గా కావాలీ అంటే ఎలా కుదురుతుందండీ.

చూడండి వచ్చే నెలనుండి అద్దె వంద పెంచుతున్నాను. మీకిష్టముంటే వుండండి. లేదా ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపొండి. మీకు ఇల్లు దొరక్కపోవు. మాకు మరొకరు అద్దెకు రాకపోరు. మీరుకాకపోతే మరొకరు. ఇల్లు ఉన్నమ్మకు ఒకే ఇల్లుగానీ ఇల్లులేని వాళ్లకు వందిళ్ళు" అంటూ పక్కవాటా వాళ్లపై అరుస్తూ ఉంది.

కామాక్షి మాటలు విని కుటుంబరావు తనలో తనే నవ్వుకుని 'ఇప్పుడు తను కామాక్షి కాదు. ఇంటావిడ కామాక్షమ్మగారుగా అందుకని' అనుకున్నాడు.

-షాహీన్ (విశాఖపట్టణం)